సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



చదువుతోనే విలువ

విద్యతోనే విలువ పెరుగుతుందని, ప్రతీ ఒక్కరు పిల్లల చదువులను ప్రోత్సహించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. 10లో



విజేత 'ఉమ్మడి ఖమ్మం'

కొత్తగూడెంలో మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. 10లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బతుకమ్మ వేడుకల్లో జిల్లా జడ్జి



బతుకమ్మ ఎత్తుకున్న జిల్లా జడ్జి పాటిల్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని జిల్లా కోర్టులో సోమవారం జరిగిన బతుకమ్మ వేడుకలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ ఆట, పాటలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని అన్నారు. పూల పండుగను మహిళలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి బానుమతి, మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి.వి.డి. లక్ష్మి, లావణ్య, విశ్వశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, దూదిపాల రవికుమార్, నల్లమల్ల ప్రతిభ, పి.నిరంజన్‌రావు, మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలకు 180 మంది హాజరు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు సోమవారం 180 మంది హాజరయ్యాని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో 94 మందికి 78 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరు అయ్యారని, పదో తరగతిలో 123 మందికి 102 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు లేకుండా ప్రశాంతంగా సాగాయని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు




మాట్లాడుతున్న రామారావు

పాల్వంచ: కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నామని తెలంగాణా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు హాజరవుతారని చెప్పారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబ సభ్యులంతా రావాలని కోరారు. ఆయన వెంట వెంకటపుల్లయ్య, తుక్కాని శ్రీనివాసరెడ్డి, రాణి, రాజశేఖర్, భార్గవ్, బాలకృష్ణ ఉన్నారు.

ఇదేం న్యాయం గురూ?

'యంగ్ ఇండియా' పేరుతో సమీకృత గురుకుల విద్యాలయాలు

- తొలిదశలో జిల్లాపై ప్రభుత్వం చిన్నచూపు..
- ఉమ్మడి జిల్లాలో మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకే అవకాశం
- మొదటి ప్రాధాన్యతలో మంత్రుల ఇలాకాలు
- ఈనెల 11న భవన నిర్మాణ పనులకు భూమిపూజ



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గత నాలుగు దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సామాజిక వర్గాల్లో విద్యను ప్రోత్సహించేందుకు గురుకుల విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేజీ టూ పీజీ అంటూ విస్తృతంగా గురుకులాలు ప్రారంభించారు. అయితే సామాజిక వర్గాల వారీగా కాకుండా అన్ని కులాల వారు ఒకేచోట చదువుకున్నప్పుడే సమతా భావన పరిఢవిల్లుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్లంలో చదువు సాగేలా యంగ్ ఇండియా పేరుతో సమీకృత గురుకుల విద్యాలయాల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున యంగ్ ఇండియా క్యాంపస్‌లు ఏర్పాటు చేయనుంది. ఒక్కో క్యాంపస్‌లో 2,560 మంది విద్యార్థులు, 120 మంది బోధన సిబ్బంది ఉంటారు. బోధనేతర సిబ్బందిని కూడా కలిపితే దాదాపు మూడు వేల మందికి ఈ క్యాంపస్‌లో స్థానం ఉంటుంది. ఇందుకోసం రూ.5,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. అయితే తొలి దశ (పైలట్ ప్రాజెక్టు)లో రాష్ట్ర వ్యాప్తంగా 19 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా క్యాంపస్‌లు నిర్మించనున్నారు. వీటి నిర్మాణ పనులకు ఈనెల 11న భూమి పూజ చేయనున్నారు. వచ్చే ఏడాది దసరా నాటికి ఈ క్యాంపస్‌లు అందుబాటులోకి రానున్నాయి.

స్థానిక ప్రజాప్రతినిధులపై విమర్శలు..

'యంగ్ ఇండియా' పైలట్ ప్రాజెక్టులో జిల్లాకు కనీస గుర్తింపు లేకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులపై విమర్శలు వస్తున్నాయి. జిల్లా నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా ఇల్లెందు నుంచి కోరం కనకయ్య, పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట నుంచి జారే ఆదినారాయణ అధికార పార్టీ నుంచే విజయం సాధించారు. అయినా వారు తమ ప్రభావం చూపించలేకపోయారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మిత్రపక్షమైన సీపీఐ తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక భద్రాచలం నుంచి బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన తెల్లం వెంకట్రావు ఇప్పుడు హస్తం గూటిలోనే ఉన్నారు. 'అందరూ ఉన్నా వడ్డించే వారు మన వారు కాదు' అన్నట్టుగా జిల్లా పరిస్థితి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మలి దశపైనే ఆశలు..

సామాజికపరంగా చూసినా జిల్లా ఎంతో కీలకంగానే ఉంది. రాష్ట్రంలో అత్యధిక అడవులతో పాటు అత్యధిక గిరిజన జనాభా ఇక్కడే ఉన్నారు. తెలంగాణలో మావోయిస్టు ప్రభావిత జిల్లాగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఏకైక జిల్లా భద్రాద్రి కొత్తగూడెమే. ఏజెన్సీ జిల్లా కావడంతో ఇక్కడ ప్రైవేట్ రంగంలోనూ విద్యావకాశాలు తక్కువగా ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్న గురుకుల విద్యాలయాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తొలి దశలో 'భద్రాద్రి'కి ఎందుకు స్థానం కల్పించలేదనే ప్రశ్నకు సరైన సమాధానం కరువైంది. అయితే యంగ్ ఇండియాలో మలి దశలో జిల్లాకు కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుందని వినిపించే మాటలు కేవలం కంటి తుడుపు చర్యలు తప్పితే మరొకటి కాదంటూ రాష్ట్ర సర్కార్‌పై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

మంత్రుల ఇలాకాలోనే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఐదు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో, మరో ఐదు ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్నాయి. ఇందులో మధిర, పాలేరు, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గాలు తొలి దశ నిర్మాణాలకు ఎంపికయ్యాయి. ఉమ్మడి జిల్లాకు తొలి దశలో మూడు క్యాంపస్‌లు దక్కడం సంతోషకరమే అయినా అన్నీ రాష్ట్ర కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజవకర్గాలకే కేటాయించడంతో మంత్రులకే తొలి ప్రాధాన్యత అనే విమర్శలు వస్తున్నాయి. మిగిలిన ఉమ్మడి జిల్లాల్లో సమతూకం పాటిస్తూ కొత్త జిల్లాలకు సైతం అవకాశం కల్పించారు. ఉదాహరణకు ఉమ్మడి వరంగల్‌లో భూపాలపల్లి, ములుగు, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ నియోజకవర్గాలకు, ఉమ్మడి నల్గొండ జిల్లాలో హుజూర్‌నగర్, తుంగతుర్తి, తిరుమలగిరి, నల్గొండ, ఉమ్మడి కరీంనగర్‌లో హుస్నాబాద్, మంథని నియోజకవర్గాలకు ఈ క్యాంపస్‌లు దక్కాయి. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం అలా జరగలేదు.

ధనలక్ష్మీ పాహిమాం..

రామాలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు..

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో లక్ష్మీ తాయారు అమ్మవారిని సోమవారం ధనలక్ష్మి రూపంలో అలంకరించారు. విద్యా ధనం, హిరణ్య ధనం, శక్తి ధనాలను ప్రసాదించే ధనలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని వేద పండితులు చెబుతున్నారు. కాగా, మధ్యాహ్నం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిపించారు. చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు కిష్కింధకాండ పారాయణం చేశారు.

నేటి ధాన్యలక్ష్మి అలంకార విశిష్టత

'ధన ధాన్యకరీం...సిద్ధీం' అంటూ పురాణం కీర్తిస్తుంది. అన్ని రకాల ధాన్యాన్ని ప్రసాదించేది ఈ అమ్మేనని, ఈ అమ్మను ఆరాధిస్తే ఈతి బాధలన్నీ తొలగి, సమయానికి తగు వర్షాలు కురిసి దేశం సస్యశ్యామలంగా ఉంటుందని పండితులు అంటున్నారు.

బేడా మండపంలో నిత్య కల్యాణ వేడుక

స్వామి వారికి బేడా మండపంలో నిత్యకల్యాణ వేడుక కనుల పండువగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోత్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, సోమవారం టీవీ యాంకర్, సినీ నటి అనసూయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ మంగళగౌరీదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి



శ్రీ మంగళగౌరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

పాల్వంచరూరల్ : శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి అమ్మవారు సోమవారం శ్రీ మంగళగౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రాతఃకాలార్చన, వేద పారాయణం, నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం తదితర పూజలు నిర్వహించారు. శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దంపతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత లక్షకుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతుల వెల్లువ

- దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
- అధికారులకు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచన



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ మాట్లాడుతూ.. సమస్యలపై ప్రజలు చేసిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులను సునిశితంగా పరిశీలించాలని, పరిష్కారానికి అర్హత లేకుంటే అదే విషయాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే ముకమామిడి ఆయిల్‌ఫెడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సంస్థలో 612 మంది రైతులు సభ్యులుగా ఉండగా, వారికి అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు మూడేళ్లుగా తక్కువ ధరకు విక్రయిస్తున్నామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సైతం తమ సంస్థకు కేటాయించాలని కంపెనీ బాధ్యులు దరఖాస్తు చేయగా.. పౌరసరఫరాల అధికారికి ఎండార్స్ చేశారు.
- ఆళ్లపల్లి మండలం అనంతోగు గ్రామంలోని వాగబోయిన బాలయ్య అనే రైతు.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తన భూమిలో ఇసుకమేటలు వేశాయని, వాటిని తొలగించాలని వినతిపత్రం అందించగా ఆళ్లపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- దుమ్ముగూడెం మండలం కొత్తపల్లికి చెందిన రైతు కణితి నారాయణ.. తనకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేయగా ఎల్‌బీఎంకు పంపించారు.

'ప్రసాద్' పనుల్లో వేగం పెంచాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పర్ణశాలలో పనుల పరిశీలన



పర్ణశాల ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

దుమ్ముగూడెం : ప్రసాద్ పథకం కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని, సీతమ్మ వారి నార చీరల ప్రాంతం, సీతవాగును సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రసాద్ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో జాప్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆ తర్వాత దేవస్థానం భూములను పరిశీలించి, ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో భక్తులకు నీడనిచ్చే చెట్లను నాటాలని అన్నారు. తులసి, తిప్పతీగ, మల్లేరు, అశ్వగంధ వంటి ఔషధ మొక్కలు పెంచాలని, వాటి గురించి భక్తులకు తెలిసేలా సమాచారాన్ని ప్రదర్శించాలని అన్నారు. దేవస్థానం పక్కనున్న పార్కింగ్ స్థలాన్ని వినియోగంలోకి తేవాలని, భక్తులు తమ వాహనాలను నిలిపేందుకు అవకాశం కల్పించాలని చెప్పారు. ప్రసాద్ పథకం కింద చేపట్టే పనుల ద్వారా భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, అందుకు దేవస్థానం, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం బొజ్జిగుప్ప, రామచంద్రుని పేట గ్రామాలను సందర్శించి ట్రైబల్ మ్యూజియం అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా గృహాలు నిర్మించాలని అన్నారు. గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే అంతర పంటలు సాగుచేసి లబ్ధి పొందాలని, పొలం గట్ల వెంట, ఇంటి వెనక పెరడులో మునగ, జామ తదితర చెట్లు పెంచాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ యాదయ్య, ఎంపీఓ రామకృష్ణ, పర్ణశాల దేవస్థానం పర్యవేక్షకుడు అనిల్‌కుమార్, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకూ ప్రభుత్వ వైద్యం

ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడి



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం : మారుమూల ఆదివాసీ గ్రామాల్లోనూ వైద్య సేవలు అందించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన వైద్య సేవల కోసం గిరిజన గ్రామాల్లోని సబ్ సెంటర్‌లు, పీహెచ్‌సీల్లో గైనకాలజిస్టులు, వైద్యులు, సిబ్బందిని నియమించాలని, వైద్య పరికరాలు అవసరమైతే ప్రతిపాదనలు అందించాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు సమాచారం అందించిన అర్ధగంటలోనే అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. ఇందుకోసం బైక్ అంబులెన్స్‌లను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని టీ హబ్‌కు అదనంగా భద్రాచలంలో మినీ టీ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. గోదావరి వరద ముంపు, రవాణా సౌకర్యం లేని గ్రామాల నుంచి గర్భిణులను తరలించి వైద్య సేవలు అందించడానికి గైనకాలజిస్టులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మారుమూల ప్రాంత పీహెచ్‌సీల్లో ఆ ప్రాంత గిరిజనుల భాష వచ్చే సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సబ్ సెంటర్‌లు, పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిపై పలు విమర్శలు వస్తున్నాయని, వాటిని రూపుమాపేలా పని చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మందుల కోసం ప్రైవేట్ షాపులకు పంపిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలాంటివి పునరావృతం కావద్దని అన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, చైతన్య పాల్గొన్నారు.

వైద్యుడిపై పీఓ సీరియస్ !

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ఏరియా ఆస్పత్రిని పీఓ రాహుల్ తనిఖీ చేశారు. ఎముకల వైద్యుడిపై ఇటీవల ఫిర్యాదులు వచ్చాయని, పద్ధతి మార్చుకోకుంటే చర్య తప్పదని చెప్పినట్లు సమాచారం.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో సత్తా

- ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా అటవీ ఉద్యోగులు
- మూడు బంగారు పతకాలు సాధించిన డీఎఫ్‌ఓ



బంగారు పతకం గెలుచుకున్న డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్

పాల్వంచరూరల్ : అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ రెండేళ్లకోసారి నిర్వహించే రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా అటవీ శాఖ ఉద్యోగులు పలు క్రీడాంశాల్లో ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేట ఫారెస్ట్ అకాడమీలో ఆది, సోమవారాల్లో జరిగిన పోటీల్లో జిల్లా అటవీ శాఖ అధికారి జి, కృష్ణగౌడ్ ఏకంగా మూడు బంగారు పతకాలు కైవసం చేసుకోవడం విశేషం. జిల్లాలోని ఆరు డివిజన్ల నుంచి సుమారు 80 మంది అటవీ ఉద్యోగులు పోటీలకు హాజరై వాలీబాల్, కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. 100 మీటర్ల పరుగు పందెంలో వైల్డ్‌లైఫ్ విభాగానికి చెందిన పద్మజ, హారిక ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు.

ప్రతిభ చాటిన డీఎఫ్‌ఓ

స్విమ్మింగ్ పోటీల్లో డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. బటర్‌ఫ్లై, ఫ్రంట్, బ్యాక్ స్ట్రోక్ విభాగాల్లో బంగారు పతకాలు, రైబల్ షూటింగ్, 5కే రన్ పోటీల్లో కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. మొత్తంగా జిల్లా అటవీ శాఖ రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. పోటీలకు వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌ఓ బి.బాబు, టెరిటోరియల్ డీఎఫ్‌ఓ కె.దామోదర్‌రెడ్డి హాజరయ్యారు.

త్వరలో క్యాథ్‌లాబ్ సేవలు

- మొదట ఆర్జీ–1లో రూ.15 కోట్లతో ఏర్పాటు
- అక్కడ సక్సెస్ అయితే వెంటనే కొత్తగూడెంలో..
- సింగరేణి కార్మికులకు అందనున్న మెరుగైన వైద్యం



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి

సింగరేణి(కొత్తగూడెం): గుండె జబ్బు ఉన్న సింగరేణి కార్మికులకు కొత్త జీవితం ప్రసాదించాలనే సంకల్పంతో యాజమాన్యం క్యాథ్‌లాబ్ సేవలను అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. మొదట ఆర్జీ–1 ఏరియాలో రూ.15 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనుండగా.. అక్కడ సక్సెస్ అయితే వెంటనే కొత్తగూడెంలోనూ ఈ సేవలు అందించాలని నిర్ణయించింది. ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా సుమారు ఐదు వేల మంది కార్మికులు గుండె జబ్బులతో బాధ పడున్నారు. వీరందరికీ వైద్యసేవలు అందించాలని యోచిస్తున్న సంస్థ ఉన్నతాధికారులు.. రామగుండంలో ఆగస్టు 15వ తేదీనే ప్రారంభించాలని భావించారు. అయితే పలు కారణాలతో వాయిదా పడగా నవంబర్‌లో ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

గోల్డెన్ అవర్‌తో నూతన జీవితం..

గుండె జబ్బు వచ్చిన గంట లోపు సరైన చికిత్స అందితే వారికి వైద్యులు కొత్త జీవితం ఇచ్చినట్టే. ఈ గోల్డెన్ అవర్ ట్రీట్‌మెంట్ కోసం యాజమాన్యం ఆలోచించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సలహాతో క్యాథ్‌లాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గుండెజబ్బు ఉన్న వారికి వ్యాధి తీవ్రతను బట్టి సరైన వైద్య సేవలు అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడేయవచ్చు. ఈ ప్రమాదం నుంచి రక్షించేందుకు క్యాథ్‌లాబ్ సేవలు ఉపకరించనున్నాయి.

సిబ్బంది కోసం సన్నాహాలు..

గుండెజబ్బుతో వచ్చిన వ్యక్తి పరిస్థితిని అంచనా వేసేందుకు, జబ్బు తీవ్రతను గుర్తించేందుకు సరైన వైద్యులు, నర్సులను ఏర్పాటుచేయాల్సి ఉంది. ఇంకా ఈసీజీ, ఎంజియోగ్రామ్ మిషన్లు, వాటి నిర్వహణకు టెక్నీషియన్లు అవసరం. సిబ్బందితోపాటు పరికరాలను సమకూర్చేందుకు యాజమాన్యం టెండర్లు ఆహ్వానించింది. ఎల్ –1 కోట్ చేసిన సంస్థకు టెండర్ ఇవ్వనుంది. అది దక్కించుకున్న సంస్థ నెల రోజుల్లో సిబ్బందిని ఏర్పాటు చేయాలి. సిబ్బందిని నియమిస్తే వీలైనంత త్వరలో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నాణ్యమైన సేవలందించేందుకే..

ఇటీవల పలువురు సింగరేణి కార్మికులు గుండె జబ్బుతో బాధ పడుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో భారీగా డబ్బు వెచ్చించినా సరైన చికిత్స అందడం లేదు. ఆయా ఆస్పత్రుల్లో చాలా మందికి నాణ్యత లేని స్టంట్‌లు వేస్తున్నారు. అవి కొన్ని రోజులకే ఫెయిలవుతున్నా.. ఎవరినీ ప్రశ్నించే పరిస్థితి ఉండడం లేదు. దీంతో కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు సంస్థ ఆధ్వర్యంలోనే క్యాథ్‌లాబ్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది.

కార్మికులకు మెరుగైన చికిత్స కోసమే..



గుండె జబ్బు వచ్చిన కార్మికులకు రూ.కోట్లు వెచ్చించి కార్పొరేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. డబ్బు ఖర్చయినా సరైన వైద్యం అందడం లేదు. అందుకే కార్మికులకు మెరుగైన చికిత్స కోసం సంస్థ ఆధ్వర్యంలోనే ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్జీ –1 ఫలితాలను బట్టి వెంటనే కొత్తగూడెంలోనూ ఏర్పాటు చేస్తాం.

– ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

జమకాని లాభాల వాటా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కార్మికులకు లాభాల వాటా చెల్లింపుపై సోమవారం సర్క్యులర్ జారీ చేసినా నగదు అకౌంట్లలో జమకాలేదు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ సాధించిన రూ.4,701 కోట్ల నికర లాభాల్లో 33 శాతం రూ.796 కోట్ల చెల్లింపుపై యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. సోమవారం నగదు జమ చేస్తామని చెప్పడంతో కార్మికులు ఎదురుచూశారు. కానీ రాత్రి 8 గంటల వరకు కూడా నగదు అకౌంట్లలో జమకాలేదు. దీంతో నిరుత్సాహానికి గురయ్యారు. సర్క్యులర్ కూడా అస్పష్టంగా ఉందని పలువురు పేర్కొన్నారు. కాగా కార్మికులకు లాభాల వాటా చెల్లించాక మిగిలిన లాభాల నుంచి ఒక రోజు కార్మికుల వేతన మొత్తాన్ని వరద బాధితులకు మినహాయిస్తామని సంస్థ పేర్కొంది. ఇప్పుడు కార్మికుల వేతనం నుంచే కోత విధించేందుకు నిర్ణయించిందని పలువురు పేర్కొంటున్నారు. దీనివల్ల ఒక్కో కార్మికుడు రూ. 2 వేల నుంచి రూ. 6 వేల వరకు నష్టపోనున్నాడని చెబుతున్నారు. ఈ క్రమంలో చెల్లించాల్సిన మొత్తంలో మార్పులు జరగడంతో సోమవారం వాటా జమచేయలేకపోయినట్లు సమాచారం.

క్లుప్తంగా

9 వరకు ఐటీఐ దరఖాస్తు గడువు

సింగరేణి(కొత్తగూడెం): ఐటీఐ కోర్సుల్లో ఆరో విడత దరఖాస్తు గడువు ఈ నెల 9వ తేదీ వరకు ఉందని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో నూతనంగా ప్రవేశపెట్టనున్న అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్‌లో ఆరు కొత్త కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు http:#ititelanganagov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్ కోర్సులు ఏడాది, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్, టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్ కోర్సులు రెండేళ్లు చదవాల్సి ఉంటుందని వివరించారు.

కేటీపీఎస్ కాపర్ వైర్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పాల్వంచ: కేటీపీఎస్‌లో గతంలో చోరీ అయిన కాపర్ వైర్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అల్లూరి సెంటర్‌లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కాగ నాగరాజు, మహేష్, శివ, అభిలాష్ అనే వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. విచారించి వారి నుంచి 10 కేజీల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాపర్‌ను గత నెల 16న కేటీపీఎస్‌లో చోరీ చేసినట్లు గుర్తించారు. స్విచ్‌యార్డు నుంచి చోరీ చేసిన 40 కేజీల్లో వైరులో కొంత గతంలోనే విక్రయించారు. మిగతా వైరు అమ్మేందుకు వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ విజేత ఉమ్మడి ఖమ్మం..

- ముగిసిన రాష్ట్రస్థాయి అండర్–17 ఫుట్‌బాల్ పోటీలు
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో నల్లగొండ, రంగారెడ్డి జట్లు



ప్రథమస్థానంలో నిలిచిన ఖమ్మం జిల్లా జట్టు

కొత్తగూడెంటౌన్: మూడు రోజులుగా హోరాహోరీగా సాగుతున్న రాష్ట్రస్థాయి అండర్–17 ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు ప్రథమస్థానంలో, నల్లగొండ రెండో స్థానంలో, రంగారెడ్డి జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచాయి. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు పోరాట పటిమ చూపారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు రాష్ట్ర ఫుట్‌బాల్ పరిశీలకుడు వడ్డెన్న బహుమతులను అందజేశారు. ఈ మేరకు ఎస్జీఎఫ్ నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ చూపిన 22 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని, వారు నవంబర్‌లో జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

చివరి రోజు జరిగిన మ్యాచ్‌లు

ఖమ్మం, నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్లగొండపై ఖమ్మం 1–0గోల్స్ తేడాతో విజయం సాధించి ప్రథమ బహుమతిని అందుకుంది. నల్ల గొండ ద్వితీయస్థానంలో నిలిచింది. మెదక్‌పై 1–0 గోల్స్ తేడాతో గెలుపొందిన రంగారెడ్డి జట్టు తృతీయస్థానంలో నిలిచింది. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బట్టు ప్రేమ్‌కుమార్ యనమదల వేణుగోపాల్, యుగంధర్, శ్రీనివాస్, మంజీలాల్, సీతాదేవి, సుజాత, విద్యాసాగర్ పాల్గొన్నారు.

టీచర్లూ.. మీరే ఓటర్లు!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు
- వచ్చేనెల 6వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం
- మూడేళ్ల సర్వీస్ ఉన్న వారంతా అర్హులే



ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అర్హులు ఫారం–19 ద్వారా ఓటు నమోదు చేసుకునే వీలుంది.

2019లో ఓటర్లు ఇలా...

2019లో జరిగిన వరంగల్– ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఖమ్మం జిల్లా నుంచి 3,634మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో పురుషులు 2,318, మహిళలు 1,316మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే, భద్రాద్రి జిల్లా మొత్తం 2043 మంది ఓటర్లకు గాను మహిళలు 796, పురుషులు 1,247 మంది నమోదయ్యారు. అయితే, గతంలో ఓటు నమోదు చేసుకున్నా తిరిగి ఈసారి కూడా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అర్హులు ఎవరెవరు?

2024 నవంబర్ 1వ తేదీ తేదీ నాటికి ముందు ఆరేళ్ల కాలంలో మూడేళ్ల కాలానికి తగ్గకుండా ఉన్నత పాఠశాల, ఆపై స్థాయి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేసి ఉండాలి. మూడేళ్లపాటు వరుసగా ఒకేచోట పని చేయకున్నా రెండు చోట్ల పనిచేసినా అర్హులుగానే పరిగణిస్తారు. అయితే, రెండు చోట్ల నుంచి తీసుకున్న సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు రెగ్యులర్, అడ్‌హాక్‌గా నియమించబడి ఉండాలి. పార్ట్‌టైమ్ టీచర్లు మాత్రం అర్హులు కారు. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారి సర్వీస్ సర్టిఫికెట్లను జిల్లా స్థాయి పర్యవేక్షణాధికారి(డీఈఓ, ఆర్ఐఓ) ద్వారా ధ్రువీకరించుకోవాలి. అంతేకాక గత ఆరేళ్ల కాలంలో చెల్లించిన జీపీఎఫ్/ఈపీఎఫ్ వివరాలను పీఎఫ్ నంబర్‌తో సహా ఈఆర్‌ఓకు సమర్పించాలి.

ఓటరుగా నమోదు ఇలా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కోసం ఫారం–19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారంపై ఫొటో అంటించి ఉపాధ్యాయుల ఎపిక్, ఆధార్ నంబర్లు రాయాలి. విధులు నిర్వర్తించిన కాలానికి సంబంధించి ప్రొఫార్మాలలో ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ జారీ చేసిన ధ్రువపత్రం సమర్పించాలి. అనంతరం దరఖాస్తులను నివాస ప్రాంతంలోని సహాయ నమోదు అధికారికి సమర్పించాలి. ప్రధానోపాధ్యాయుడు / ప్రిన్సిపాల్ కవరింగ్ లెటర్‌తో ఒక విద్యాసంస్థలోని అందరి దరఖాస్తులు సమర్పించే అవకాశముంది. ఇక ఫారం–19ను తహసీల్, ఆర్డీఓ కార్యాలయాల్లో నేరుగా అందించే అవకాశముంది. అలా కాకపోతే www.ceotelangana. nic.in ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం ఫొటో, డిగ్రీ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసి పరిశీలన సమయాన సిబ్బందికి డిగ్రీ సర్టిఫికెట్, ధ్రువపత్రం ఒరిజినల్ చూపించాలి. ఓటరుగా నమోదు చేసుకునే ఉపాధ్యాయులు గత ఆరేళ్లలో మూడేళ్లు బోధన చేసినట్లు సంబంధిత విద్యాసంస్థ నుంచి ధ్రువీకరణ సర్టిఫికెట్ జత చేయాలి.

షెడ్యూల్ ఇదీ..

వచ్చే నెల 6వ తేదీ ఓటరుగా నమోదు కోసం అవకాశముంది. ఆపై 23వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. ఇందులో అభ్యంతరాలను డిసెంబర్ 9వరకు స్వీకరించి, అదే నెల 25లోపు పరిష్కరిస్తారు. అనంతరం డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా వెల్లడిస్తారు.

చదువుతోనే విలువ పెరుగుతుంది..

ఎస్పీ రోహిత్‌రాజ్



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

చర్ల: విద్యతోనే విలువ పెరుగుతుందని, ప్రతీ ఒక్కరు పిల్లల చదువులను ప్రోత్సహించాలని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. మండలంలోని వలస ఆదివాసీ గ్రామం బూరుగుపాడులో సీఐ ఎ.రాజువర్మ రూ.2లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని సోమవారం ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పిల్లలను చదువుకు దూరం చేయొద్దని కోరారు. సీఐ రాజువర్మ అభినందనీయులని అన్నారు. ఓఎస్డీ సాయిమనోహర్ మాట్లాడుతూ.. మావోయిస్టుల భావజాలానికి దూరంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నారని, ఆదివాసీలు వారిని దరిచేరనీయొద్దని సూచించారు. అనంతరం 43 మంది విద్యార్థులకు ఎస్పీ స్టేషనరీ అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం సవలం వీరస్వామి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్బీ–2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం కొనసాగించాలి

మావోయిస్టు పార్టీలో చేరి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుని, ఆ తర్వాత పార్టీ నైజాన్ని గుర్తించి లొంగిపోయిన వారు ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలని, వారికి అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ ఇటీవల లొంగిపోయిన ఐదుగురికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ 12.60 లక్షల చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మావోయిస్టులు తమ స్వలాభం కోసమే ఆదివాసీలను వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ క్రమంలో ఎంతోమంది ఆదివాసీల విలువైన జీవితాలు నాశనమవుతున్నాయని అన్నారు. మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న వారు స్వచ్ఛందంగా లొంగిపోతే వారిపై ఉన్న కేసులు రద్దు చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తామని, పిల్లల చదువుపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీఇచ్చారు. అనంతరం మాజీ మావోయిస్టులు మడివి సోమ్మక్కకు రూ.4 లక్షలు, మడకం లింగా అలియాస్ రాజేష్‌కు రూ.4 లక్షలు, బడవి భద్రకు రూ.4లక్షలు, కట్టం పొజ్జయ్యకు రూ. 40వేలు, కల్మ బుద్రకు రూ. 20 వేల చెక్కులు అందజేశారు.

ఎంసీహెచ్‌లో 'స్కానింగ్' లేదు

గర్భిణులను 104 వాహనంలో ఇల్లెందుకు పంపుతున్న వైద్యులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని రామవరంలో ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో నెల రోజులుగా గర్భిణులకు స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. గత నెల ఆస్పత్రిలో పనిచేస్తున్న రేడియాలజిస్టును వైద్యశాఖ బదిలీ చేసింది. ఆ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. దీంతో గత నెల 3 తేది నుంచి స్కానింగ్ సేవలు బందయ్యాయి. ఎంసీహెచ్‌లో నిత్యం 300 వరకు ఓపీ నమోదవుతుంది. దీంతో నిత్యం పలువురు గర్భిణులు ఎంసీహెచ్‌కు వస్తుండగా స్కానింగ్‌సౌకర్యం లేకపోవడంతో 104 అంబులెన్స్‌లో ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి పంపిస్తున్నారు. అక్కడ స్కానింగ్ తీసుకుని వచ్చాక చికిత్స అందిస్తున్నారు. ఫలితంగా గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. దీంతో గర్భిణులపై ఆర్థికభారం భారం పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్కానింగ్ సేవలను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



జోగారావు(ఫైల్)

దుమ్ముగూడెం : మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కొర్సా జోగారావు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. జోగారావు ప్రస్తుతం చిన్న ఆర్లగూడెం జీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జోగారావు మృతితో పెద్దనల్లబల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి పట్ల టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు, మండల జనరల్ సెక్రటరీ రవి సంతాపం తెలిపారు.

సమ్మక్క కుటుంబానికి న్యాయం చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో భద్రాచలం ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం, ఐద్వా నాయకులు

భద్రాచలంఅర్బన్: వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన సమ్మక్క కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం ఆధర్వర్యంలో సోమవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. దుమ్ముగూడెం మండలం చింతగుప్ప గ్రామానికి చెందిన గర్భిణి ఊయిక సమ్మక్క (25) మూడో కాన్పు కోసం ఆదివారం ఉదయం ములకపాడు వైద్యశాలలో చేరింది. అక్కడి వైద్యులు సమ్మక్కకు సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో పరిస్థితి చేయి దాటిపోయింది. దీంతో ఆమెను 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించి, అప్పటికే సమ్మక్క మృతిచెందినట్లు భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. కాగా వైద్యుల నిర్లక్ష్యం వల్లే గర్భిణి మృతి చెందిందని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం ఉదయం సీపీఎం ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఐద్వా పట్టణ కమిటీ కూడా మద్దతుగా నిలిచింది. ఈ సందర్భంగా సీపీఎం, ఐద్వా నాయకులు మాట్లాడుతూ ఐటీడీఏ పీఓ కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వాలని, ప్రతీ ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్టును నియమించాలని డిమాండ్ చేశారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఆందోళన కొనసాగింది. పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఆందోళనకారులు శాంతించలేదు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు ఆస్పత్రి వద్దకు చేరుకుని, అక్కడి నుంచే ఐటీడీఏ పీఓ రాహుల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మృతురాలు సమ్మక్క కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆందోళనకారులను ఐటీడీఏ పీఓ రాహుల్ వద్దకు తీసుకుని వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన పీఓ రాహుల్ మృతురాలి భర్తకు, ఆమె చెల్లికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని, సమ్మక్క కుమార్తెకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. తక్షణసహాయం కింద మృతురాలి అంత్యక్రియలకు దుమ్ముగూడెం వైద్య సిబ్బంది రూ.20 వేలు, ఎమ్మెల్యే వెంకట్రావు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, ఐద్వా నాయకురాలు సీతాలోక్ష్మి, లీలావతి, సమ్మక్క కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

ద్విచక్ర వాహనాదారుడికి తీవ్రగాయాలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం బైక్‌ను టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం పరిధిలోని తొకుగూడెం గ్రామానికి చెందిన కణితి రామారావు తన ద్విచక్రవాహనంపై అంబేడ్కర్ సెంటర్ నుంచి కూనవరం రోడ్డు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో రామారావు కింద పడగా, లారీ అతని ఎడమ కాలిపై నుంచి వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు క్షతగాత్రుడిని ఆటోలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డ్యూటీ డాక్టర్ రామారావు ఎడమకాలికి ఆపరేషన్ చేసి కొద్ది భాగాన్ని తొలగించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆపరేషన్ చేసే పరిస్థితిలేదు. దీంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

తల్లాడ: తల్లాడ ఎన్టీఆర్ నగర్ కాలనీ సమీపాన సోమవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీనీ ఢీకొట్టిన బొలెరో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లింది. విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. అనంతరం తిరిగి వెళ్తుండగా ఎన్టీఆర్ కాలనీ వద్ద ఆగి ఉన్న లారీని వెనక వీరి వాహనం ఢీకొట్టడంతో అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే, బొలెరోలో ఉన్న విజిలెన్స్ అధికారులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తృటిలో ప్రమాదం నుంచి బయట పడ్డామని విజిలెన్స్ అధికారులు బి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఓ వ్యక్తి సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన గొళ్లపల్లి ప్రసాద్(38) భార్యతో గొడవ పడి ఆమెపై దాడి చేశాడు. భయంతో ఇంట్లోంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ప్రసాద్‌ను స్థానికులు మణుగూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సతీష్‌కుమార్

అశ్వారావుపేట: అంతర్ రాష్ట్ర దొంగలను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ కథనం ప్రకారం.. అశ్వారావుపేట ఎస్సై యయాతి రాజు, దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్‌లో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: పట్టణంలోని గోవింద్ సెంటర్‌లో సోమవారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. డీఎస్పీ ఎన్.చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణల నేతృత్వంలో ఈ సోదాలు జరిగాయి. 34 మంది వాహనదారులకు జరిమానా విధించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. నంబర్ ప్లేట్‌తో వస్తే వాహనం అందజేస్తామని వివరించటంతో వాహనదారులు వెనుదిరిగారు. వాహనదారులకు వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు సూర్య, నాగుల్ మీరా తదితరులు ఉన్నారు.

ఇసుక లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీ

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్సై కిన్నెల రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వీకే రామవరం శివారు మొర్రేడు వాగు నుంచి లారీల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడిలు నిర్వహించారు. ములకలపల్లి వైపు వస్తున్న లారీని మాధారం అటవీ ప్రాంతంలో పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి, ఠాణాకు తరలించారు.

మూడో వ్యక్తి మృతదేహం గుర్తింపు

ఖమ్మం అర్బన్: ఖమ్మం దానవాయిగూడెం వద్ద సాగర్ కాల్వలో గత సోమవారం గల్లంతైన ముగ్గురిలో చివరి వ్యక్తి కట్టా ప్రసాద్(30)మృతదేహం సోమవారం ఖమ్మం గోపాలపురం వద్ద సాగర్ కాల్వ నీటిలో తేలింది. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలానికి చెందిన చల్లా రమేశ్, బండారు భరత్ కుమార్, వెంకన్న, కట్టా ప్రసాద్ దానవాయిగూడెం వద్ద జిల్లా జైలులో ఉన్న మిత్రుడిని చూసేందుకు వచ్చారు. తిరిగి వెళ్లే సమయాన వెంకన్న ఆటోలోనే ఉండి పోగా మిగతా ముగ్గురు సాగర్ కాల్వలో ఈతకు దిగి గల్లంతైన విషయం విదితమే. ఇందులో భరత్‌కుమార్ మృతదేహం గత మంగళవారం, చల్లా రమేశ్ మృతదేహం రఘునాథపాలెం మండలం వీవీ.పాలెం లాక్‌ల వద్ద బుధవారం గుర్తించారు. అప్పటి నుంచి గాలిస్తుండగా ప్రసాద్ మృతదేహం సోమవారం లభించింది. దీంతో ఇన్నాళ్లు ఎక్కడో ఓ చోట సజీవంగా ఉండి ఉంటాడని ఆశగా చూస్తున్న ఆయన కుటుంబంలో విషాదం నిండినట్లయింది.

భార్యపై గొడ్డలితో దాడి : కేసు నమోదు

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో సోమవారం ఓ వ్యక్తి తన భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. గ్రామానికి చెందిన కుర్సం సురేష్ మద్యం మత్తులో తన భార్య సత్యవతిపై గొడ్డలితో దాడి చేయగా కాలు, చేయికి గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను 108లో భద్రాచలం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సత్యవతి పినపాక, కరకగూడెం మండలాల 108 అంబులెన్స్‌లో నర్సుగా పని చేస్తోంది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14 పశువులు స్వాధీనం

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వాజిద్ అనే వ్యక్తి మోరంపల్లి బంజర నుంచి హైదరాబాద్‌కు మినీ గూడ్స్ వాహనంలో 14 పశువులను తరలిస్తున్నాడు. ఈ క్రమంలో టేకులపల్లిలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

50 కేజీల గంజాయి సీజ్

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు 50 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఆటోలో గంజాయి తరలిస్తుండగా గుర్తించి ఆటో, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ ఆకుల శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సుజాతనగర్: మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామశివారులో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేశారు. రూ.72 వేల నగదు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జుబేదా బేగం తెలిపారు. పట్టుబడిన వారిలో ఓ మాజీ ఎంపీపీ కుమారుడు, సింగరేణి ఉద్యోగి ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

పవన్ కల్యాణ్‌పై కేఏ పాల్ ఫిర్యాదు



పంజగుట్ట (హైదరాబాద్): తిరుపతి లడ్డూ విషయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 100 కోట్ల మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఏ పాల్ సోమవారం పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పాల్ మాట్లాడుతూ లక్ష లడ్డూలు కల్తీ చేసి అయోధ్యకు పంపించారని అబద్ధపు మాటలు మాట్లాడారని, లడ్డూపై విచారణ జరిగిందే జూన్‌లో కాగా, అయోధ్య ప్రారంభోత్సవం జనవరిలో జరిగిందని కల్తీ ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. 14 సెక్షన్ల కింద ఫిర్యాదు చేశానని, ఆర్టికల్ 8 ప్రకారం ఆయన్ను వెంటనే ఉపముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని, లేదా ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్‌కు ఎవరు స్క్రిప్ట్ ఇస్తే.. అది సినిమాలో మాదిరి చదువుతున్నాడని, గతంలోనే చెప్పినా వినిపించుకోలేదన్నారు. ఏపీ స్పీకర్, గవర్నర్, దేశ ప్రధాని, కేంద్ర హోంమంత్రి, చీఫ్ జస్టిస్, సీబీఐ అతనిపై విచారణ చేయాలని, వెంటనే పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు నాలుగో స్థానం



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆదాయంలో నాలుగో స్థానంలో నిలిచింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎక్కువ ఆదాయం పొందిన రైల్వే స్టేషన్ల జాబితాను రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. ఈ జాబితాలో ఢిల్లీ మొదటి స్థానంలో, హౌరా రెండో స్థానం, చెన్నై మూడో స్థానంలో నిలిచాయి. న్యూఢిల్లీ స్టేషన్ నుంచి రూ.3,337 కోట్ల ఆదాయం రాగా, హౌరా స్టేషన్ నుంచి రూ.1,692 కోట్లు, చెన్నై సెంట్రల్ నుంచి రూ.1,299 కోట్లు, సికింద్రాబాద్ నుంచి రూ.1,276 కోట్ల ఆదాయం సమకూరింది.

• బాబు జమానా.. అవినీతి ఖజానా

ముంపులోనూ మేసేశారు

చంద్రబాబు వరద లెక్కల్లో బయటపడిన దిమ్మతిరిగే అవినీతి

అరకొర సహాయక చర్యలు.. వాటిలోనే రూ.534 కోట్లు బొక్కేశారు

బుడమేరు గేట్లెత్తి బెజవాడను నిండా ముంచిన చంద్రబాబు సర్కారు.. ఆదుకోండి మహాప్రభో అని వేడుకునేందుకు వచ్చిన వరద బాధితులను కలెక్టరేట్ గేట్లు మూసి నిర్దయగా గాలికొదిలేసింది. కానీ.. అదే వరద పేరు చెప్పి పాలకులు రూ.వందల కోట్లు కొల్లగొట్టేశారు. సహాయక చర్యలు చేపట్టి బాధితుల్ని ఆదుకున్నట్టు ఇప్పటికీ గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు.. ఆ ముసుగులో ఏ పనీ చేయకుండానే ఖర్చుల పేరిట ఖజానా నుంచి భారీఎత్తున నిధులను పక్కదారి పట్టించారు.



- భోజనాలకే రూ.368 కోట్ల వ్యయం
- అసలు పెట్టని ఒక్కో భోజనానికి రూ.376 చొప్పున ఖర్చు
- ఎక్కడా కల్పించని తాత్కాలిక వసతికి రూ.1.39 కోట్లు.. పంచని అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులకు రూ.23 కోట్లు
- కేవలం డ్రోన్లకే రూ.2 కోట్లు
- మంచినీళ్ల బాటిళ్ల కోసం ఏకంగా రూ.26 కోట్లు.. వాటికి అంత ఖర్చవుతుందా! అని ప్రశ్నిస్తున్న జనం
- అవన్నీ ఎక్కడ పంచారని బాధితుల నిలదీత

సాక్షి, అమరావతి: వరద సహాయక చర్యల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చుల లెక్కలు ప్రజల్ని నివ్వెరపరుస్తున్నాయి. బుడమేరు, కృష్ణా వరదలో పేరుకుపోయిన అవినీతి బురదను చూసి జనం అసహ్యించుకుంటున్నారు. సహాయ, పునరావాస చర్యల్లో ఘోరంగా విఫలమైన టీడీపీ సర్కారు.. ఖర్చులు మాత్రం దిమ్మతిరిగేలా చూపడంతో ఇంత ఖర్చు ఎక్కడ పెట్టారోనని ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు సహాయక చర్యలే చేపట్టక జనం అల్లాడిపోతే ప్రభుత్వం ఏకంగా రూ.534 కోట్లను రిలీఫ్ క్యాంప్‌ల కోసం ఖర్చు చేసినట్టు చెబుతుండటం విస్తుగొలుపుతోంది. గత నెలలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలను వరదలు అతలాకుతలం చేసినా ప్రభుత్వం ఎక్కడా పునరావాస కేంద్రాలు తెరవలేదు. విజయవాడలోని సగం ప్రాంతం మునిగిపోయినా పునరావాస కేంద్రాలు లేకపోవడంతో జనం డాబాలపైన, అపార్ట్‌మెంట్స్‌లోని పై అంతస్తుల్లోనే వారం రోజులపాటు గడిపారు. కాగితాల్లో పునరావాస కేంద్రాలు తెరిచినట్టు చూపించినా రెండు, మూడు మినహా అవి ఎక్కడా లేవు. తెరవని పునరావాస కేంద్రాల కోసం రూ.1.39 కోట్లు ఖర్చయినట్టు ప్రభుత్వం లెక్క రాసేసింది.

భోజనం ఖర్చు రూ.376

అన్ని ఖర్చుల్లోనూ భోజనాల ఖర్చే రూ.368.18 కోట్లు చూపించడంతో వరద బాధితులు నోరెళ్లబెడుతున్నారు. బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు పెద్దఎత్తున ఆహారం సమకూర్చారు. వరద ఎక్కువగా ఉండటంతో ముంపు ప్రాంతాల్లో శివారు ప్రాంతాలకు వాటిని తీసుకెళ్లడం సాధ్యం కాలేదు. కానీ.. చంద్రబాబు మాత్రం ప్రభుత్వం తరఫున 97 లక్షల మందికి ఆహారం అందించినట్టు లెక్క రాసేశారు. 3.97 లక్షల మందికి టిఫిన్, 4.33 లక్షల మందికి మధ్యాహ్న భోజనం, 4.26 లక్షల మందికి రాత్రి భోజనం ఇచ్చినట్టు ఆయనే స్వయంగా పలుమార్లు వెల్లడించారు. 97.70 లక్షల మందికి టిఫిన్, లంచ్, డిన్నర్‌కి రూ.368.18 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కల్లో చూపారు. అంటే ఒక్కో బాధితుడికి రోజుకు రూ.376 చొప్పున ఆహారం కోసం ఖర్చు చేసినట్టు రాసుకుని ఆ మొత్తాన్ని కొల్లగొట్టారు. ఆహారం అందక జనం అష్టకష్టాలు పడితే.. వారికి స్టార్ హోటల్ భోజనం పెట్టినట్టు చెప్పడాన్ని బట్టి అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

మంచినీళ్లలోనూ అదే తీరు

వరద బాధితులకు 94 లక్షల మంచినీళ్ల బాటిళ్లు ఇచ్చినట్టు లెక్క రాసుకుని రూ.26.80 కోట్లను పాలకులు బొక్కేశారు. 94 లక్షల బాటిళ్లలో పావు వంతు కూడా జనానికి అందలేదు. నిత్యావసర సరుకులు కూడా అందరికీ అందకపోయినా లక్షలాది మందికి ఇచ్చేసినట్లు.. అందుకోసం రూ.61 కోట్లకు పైగా ఖర్చయినట్టు లెక్కల్లో చూపించారు. విజయవాడ సింగ్‌నగర్ పరిసరాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల వరద కంపు కొడుతున్నా, చెత్త కనిపిస్తున్నా పారిశుధ్యం మాత్రం సూపర్‌గా ఉందని.. ఇలా చేయడానికి రూ.51 కోట్లు ఖర్చయ్యిందని లెక్కల్లో రాసేసుకున్నారు.

అగ్గిపెట్టెలు, కొవ్వొత్తుల కోటా రూ.23 కోట్లు

అన్నిటికంటే విచిత్రమైన విషయం కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23.07 కోట్లు ఖర్చవడం. అసలు జనానికి ఇవి ఎక్కడ ఇచ్చారో అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఏ ప్రాంతంలో వరద బాధితుల్ని అడిగినా కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు ఎక్కడ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో మొబైల్ జనరేటర్ల ఖర్చు కూడా అందులో ఉందని కవర్ చేసుకుంటున్నారు. కానీ.. అవి ఎక్కడ, ఎన్ని పెట్టారో కూడా అధికారులకు తెలియదు. అవినీతి వరదలో వీటి ఖర్చే వింతల్లోకెల్లా వింతగా కనిపిస్తోంది.

డ్రోన్ల ఖర్చు రూ.2 కోట్లు

వరద ఖర్చుల వింతల్లో డ్రోన్ల ఖర్చు సరికొత్తగా ఉంది. కేవలం డ్రోన్ల కోసం రూ.2 కోట్లు ఖర్చు చేసినట్టు చూపించారు. డ్రోన్లతో ఆహారం సరఫరా చేసినట్టు ఏఐ సాయంతో ఫొటోలు తయారు చేసి.. ఇప్పుడు వాటికి కోసం కోట్లు ఖర్చయినట్టు లెక్కలు రాశారు. చెత్త తరలింపు, వరద నీరు తోడటం వంటి ఖర్చులే రూ.7 కోట్లు దాటిపోయాయి. వరద బాధితుల తరలింపు, చెత్త ఎత్తడం, పారిశుధ్యం ఈ లెక్క వేరేగా ఉంది. అవన్నీ కలుపుకుంటే ఖర్చులే రూ.557 కోట్లు దాటిపోయింది.

ఇవన్నీ ఎక్కడ పంచారు

ఇంత భారీ ఎత్తున సహాయ, పునరావాస చర్యల కోసం ఖర్చు పెట్టినట్టు ప్రభుత్వం చెబుతుండటంతో అంత ఖర్చు ఎక్కడ పెట్టారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. చేయని ఖర్చుకు భారీగా లెక్కలు చూసి సర్కారు పెద్దలు దండుకున్నట్టు ఏ లెక్క చూసినా స్పష్టమవుతోంది. ఈ సొమ్ములో చాలా వరకూ విడతల వారీగా ఇప్పటికే విడుదలైంది. కలెక్టర్లు, వివిధ శాఖల ద్వారా ఆ సొమ్మును డ్రా చేసి బిల్లులు కూడా చాలా వరకూ చెల్లించేశారు. వరద ఖర్చుల్లో ఒక్కో అంశంపైనా అవినీతి కేసులు పెట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరద బాధితులను ఆదుకోకపోగా వారి పేరుతో రూ.వందల కోట్లు దోచేయడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.500 కోట్ల విరాళాలు హుష్ కాకి!

వరద బాధితులను ఆదుకోవడానికి చంద్రబాబు భారీగా విరాళాలు సేకరించారు. ఇప్పటివరకు రూ.500 కోట్లకుపైగా నిధులు దాతల నుంచి అందినట్టు ప్రకటించారు. విరాళాలు బాగా వచ్చాయనుకుంటే.. వాటికి మించి రూ.557 కోట్ల ఖర్చుల లెక్కలు చూపించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రాన్ని కుంగదీసిన వరద చంద్రబాబు సర్కారుకు కాసులు కురిపించినట్టు స్పష్టమవుతోంది. బాధితులకు రూ.602 కోట్ల నష్టపరిహారం ఇచ్చినట్టు ప్రకటించినా.. ఇంకా చాలా మందికి అందలేదు. నిత్యం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బాధితులు చేస్తున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనం.

సర్వభూపాలపై సర్వాంతర్యామి

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సర్వభూపాల వాహనంపై వేణుగోపాలకృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వాహన సేవ వైభవంగా సాగింది. ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో మలయప్ప దర్శనమిచ్చారు.




సర్వ భూపాల వాహనంపై విహరిస్తున్న మలయప్ప

చంద్రబాబుకు హైదరాబాద్‌పై తగ్గని మక్కువ

ఏపీ సీఎంగా ఉన్నా.. వారానికి రెండురోజులు ఇక్కడే!

- ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడూ చుట్టపు చూపుగానే ఏపీకి చంద్రబాబు
- తెలంగాణలో టీడీపీ బలోపేతం పేరుతో కొత్త రాజకీయం
- తాజాగా టీడీపీలో చేరుతానని ప్రకటించిన మాజీ మేయర్ తీగల
- మనవరాలి పెళ్లికార్డు ఇవ్వడానికి కలసిన మాజీ మంత్రి మల్లారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హైదరాబాద్‌పై మక్కువ తీరడం లేదు. తెలంగాణ వెనుకబాటు తనానికి, వనరుల దోపిడీకి కారణం చంద్రబాబేనని తెలంగాణవాదులు ఎన్ని విమర్శలు చేసినా, ఏపీకి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఏంపని అని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రశ్నిస్తున్నా.. ఆయన పట్టించుకోవడం లేదు. జూన్ 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత చంద్రబాబు సుమారు 10 సార్లు హైదరాబాద్ వచ్చారు. మరీ అత్యవసర పని మినహాయిస్తే.. దాదాపుగా ప్రతి శని, ఆదివారాలు ఆయన హైదరాబాద్‌లోనే మకాం వేస్తూ.. ఇక్కడి నుంచే రాజకీయాలు నడుపుతున్నారన్న విమర్శలున్నాయి. ఆయన ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చుట్టపుచూపుగానే వెళ్లి వచ్చేవారని గుర్తు చేస్తున్నారు. ఏపీలో ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు వెళ్తే రాద్ధాంతం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు హైదరాబాద్‌లో ఎందుకు మకాం వేస్తున్నారో చెప్పాలని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు. కాగా చంద్రబాబు హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా.. గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసి, తెలంగాణ ఏర్పాటు తరువాత బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన నాయకులు, ప్రజాప్రతినిధులు తరచూ కలుస్తుండడం కొత్త అనుమానాలను రేకెత్తిస్తోంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది అంతకు ముందు చంద్రబాబును కలసి చర్చలు జరిపిన వారే కావడం విశేషం. జూలై మొదటి వారంలో చంద్రబాబును కలసిన అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ ఆ తరువాతే కాంగ్రెస్ గూటికి చేరారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం అప్పట్లో చంద్రబాబును ఆయన నివాసంలో కలసి చర్చలు జరిపారని గుర్తు చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరుతానన్న తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం టీడీపీ ఎమ్మెల్యేగా 2014లో ఎన్నికై బీఆర్‌ఎస్‌లో చేరి, 2018లో ఓడిపోయిన హైదరాబాద్ నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన తన కోడలు తీగల అనితారెడ్డితో కలసి ఫిబ్రవరి 26న కాంగ్రెస్‌లో చేరారు. అయితే కాంగ్రెస్‌లో కూడా తగిన ప్రాధాన్యం లభించకపోవడంతో ఆయన కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన చంద్రబాబును జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిశారు. అదే సమయంలో బాబుతో భేటీ అయిన మాజీ మంత్రి మల్లారెడ్డి.. తన మనవరాలి వివాహానికి ఆహ్వానించేందుకు చంద్రబాబును కలసినట్లు చెప్పగా, తీగల కృష్ణారెడ్డి మాత్రం తాను త్వరలోనే టీడీపీలో చేరనున్నట్లు స్పష్టం చేశారు. తనతో పాటు చాలా మంది టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తీగల వ్యాఖ్యానించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు కూడా చెప్పిన చంద్రబాబు తన అనుయాయుడు రేవంత్‌రెడ్డి కోసం ఆ ఎన్నికల్లో అభ్యర్థులను కూడా నిలబెట్టలేని విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు.

జిల్లా వార్తలు

మిర్చికి పొర.. చీడపీడలకు తెర!





మోతె సమీపాన మిరప చేనులో వేసిన మల్చింగ్ (ఇన్‌సెట్) చేనులో ప్లాస్టిక్ మల్చింగ్ వేస్తున్న రైతులు

మిరప చేన్లలో కలుపు నియంత్రణకు ప్లాస్టిక్ మల్చింగ్ పరిష్కారంగా నిలుస్తోంది. భద్రాద్రి జిల్లాలో రైతులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. మొక్కలు నాటే సమయాన ప్లాస్టిక్ మల్చింగ్ వేయడం ద్వారా కలుపు మొక్కలు, చీడపీడల వృద్ధిని అరికట్టడమే కాక నేలలో తేమ ఎక్కువ కాలం నిలుస్తుందని చెబుతున్నారు. ఫలితంగా నీరు ఆదా అవుతుందని అధికారులు కూడా అవగాహన కల్పిస్తుండటంతో రైతులు ఈ విధానంపై మక్కువ కనబరుస్తున్నారు.

– కరకగూడెం

సమష్టి కృషితో తెరుచుకున్న బడి!

- కీలకంగా వ్యవహరించిన యువత
- చేయూతనిచ్చిన గ్రామస్తులు, అధికారులు
- లక్ష్మీనగరంలోని పీఎస్‌లో మళ్లీ పాఠాలు

దుమ్ముగూడెం: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల అర్ధంతరంగా మూతబడడంతో యువత, గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. అంతా ఒక తాటిపైకి చేరి చేయిచేయి కలిపి బడికి నూతన వనరులు ఏర్పాటు చేసి పునఃప్రారంభించారు. స్థానికుల సహకారంతో ఏ పనైనా సాధ్యమవుతుందని పునఃప్రారంభమైన దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలోని ప్రాథమిక పాఠశాల ఉదంతం తెలియజేస్తోంది.

70 ఏళ్లుగా బోధన

మండలంలోని ప్రధాన గ్రామమైన లక్ష్మీనగరంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా.. సీఎస్‌ఐ ఎయిడెడ్ పాఠశాల 70 ఏళ్ల కిందట ప్రారంభమైంది. వేలాది మంది ఇక్కడ చదువుకోగా పలువురు ఉన్నత స్థాయికి చేరారు. అయితే, పాఠశాల నిర్వహణలో కొన్నేళ్లుగా సీఎస్‌ఐ సంస్థ విఫలం కావడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. కొందరు ప్రైవేట్ పాఠశాలలకు, మరికొందరు పక్క గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లారు. ఈ క్రమాన 35 మందే మిగలడంతో ఈ ఏడాది జూన్‌లో పాఠశాలను మూసివేశారు. ఆపై పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయింది.

దాతల సాయంతో బడికి మెరుగులు

పాఠశాల ప్రారంభమైనా వసతులు లేకపోవడంతో స్థానికులు వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ఈ మేరకు పలువురు దాతలు ముందుకొచ్చారు. ఆవరణలో చెత్తాచెదారం తొలగించి మట్టి పోసి చదును చేసేందుకు రూ.50 వేలు వెచ్చించారు. ఆపై తాగునీటి సరఫరాకు అవసరమైన పైప్‌లైన్, తరగతి గదిలో ఫ్లోరింగ్, ఇతర మరమ్మతులకు రూ.10 వేలు, రంగులు వేయించడానికి రూ.25 వేలు, విద్యుత్ సరఫరాకు రూ.16 వేలు, గేట్ ఫ్యాన్ ఏర్పాటుకు రూ.10 వేలు వెచ్చించేందుకు పలువురు ముందుకొచ్చారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ మొత్తం కార్యక్రమంలో లక్ష్మీనగరానికి చెందిన యువకులు డింగి సందీప్‌రెడ్డి, గోసుల వెంకట్, అన్వర్, అక్బర్, శివకాంతరెడ్డి, దల్లి హరిబాబు, వేమన్న, వీరేందర్ కీలకంగా వ్యవహరించారు. వీరికి గ్రామ పెద్దలు గుడ్ల రాంమోహన్‌రెడ్డి, పిలకా వెంకటరమణారెడ్డి, ఎం.డీ.బేగ్, కొండపల్లి నరేంద్ర, బత్తుల శోభన్, గుడ్ల తాతారావు, డింగి కన్నారెడ్డి అండగా నిలిచారు. అంతేకాక తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ సమ్మయ్య, విద్యుత్ ఏఈ మోహన్‌రెడ్డి సహకరించడంతో బడి మళ్లీ కళ సంతరించుకుంది.



రంగులు వేయడంతో కళ సంతరించుకున్న పాఠశాల



పాఠం చెబుతున్న టీచర్ (సెలవులకు ముందు)

ఏం చేద్దాం.. ఎలా చేయాలి..

పాఠశాల మూతపడడంతో ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో స్థానికులు తట్టుకోలేకపోయారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన పాఠశాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ వెంటనే అధికారులు డిప్యూటేషన్‌పై ఓ మహిళా ఉపాధ్యాయురాలిని నియమించడంతో మళ్లీ పాఠాలు మొదలయ్యాయి. ఈ ఏడాది 20 మంది విద్యార్థులు హాజరవుతుండగా వచ్చే ఏడాది ఈ సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.



పాఠశాల ప్రారంభ వేడుకలో అధికారులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

వానరాల మృత్యుఘోష



మృతి చెందిన తల్లి వానరంపై రోదిస్తున్న శిశువు

సత్తుపల్లి: పెద్దసంఖ్యలో కోతులు విలవిల్లాడుతూ మృతి చెందడం.. వాటి పిల్లలు తల్లులను వీడలేకపోవడాన్ని చూసిన పలువురికి కంటతడి పెట్టించింది. సత్తుపల్లి మండలం కిష్టారం లారీ యూనియన్ ఆఫీస్ సమీపాన నిత్యం పెద్ద సంఖ్యలో కోతులు తిరుగుతుంటాయి. అయితే, ఎవరైనా విషం పెట్టారో, పొలాల్లో గుళికల మందు కలిపిన నీళ్లు తాగాయో తెలియదు కానీ విలవిల్లాడుతూ పదుల సంఖ్యలో కోతులు కన్నుమూశాయి. ఈ దృశ్యాలను పలువురు వీడియో తీయగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, అటవీ అధికారుల దృష్టికి వెళ్లడంతో కోతుల మృతిపై ఆరా తీస్తున్నారు. కిష్టారం పశువైద్యాధికారి ప్రవీణ్ మృతి చెందిన కోతులకు పోస్టుమార్టం నిర్వహించారు. అలాగే, బీజేపీ నాయకుడు నంబూరి రామలింగేశ్వరరావు పరిశీలించి కోతుల మృతిపై విచారణ జరిపించాలని, అస్వస్థతకు గురైన జీవాలకు చికిత్స అందించాలని కోరారు. నాయకులు సుదర్శన్ మిశ్రా, పాలకొల్లు శ్రీను, భాస్కర్ల వీరంరాజు, ఆచంట నాగస్వామి, మందా శివ, శేషగిరిరావు, గణేష్ పాల్గొన్నారు.

ఖమ్మం సర్కిల్‌కు 24 మంది ఏఈఈలు

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 24 మంది ఏఈఈలను మిషన్ భగీరథ ఖమ్మం సర్కిల్‌కు కేటాయించారు. ఇందులో 12 మందిని ఖమ్మం జిల్లాకు, 12 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించగా, నేడోరేపో విధుల్లో చేరనున్నారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా మరింత మెరుగుపడనుంది.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి



ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న జయమ్మ, పక్కన మల్లు లక్ష్మి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని.. రిజర్వేషన్లతో పాటు మహిళలు హక్కుల సాధనకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఖమ్మంలో సోమవారం ఐద్వా జిల్లా మహాసభ నిర్వహించారు. తొలుత సత్తెనపల్లి రామకృష్ణ భవన్ వద్ద ఐద్వా పతాకాన్ని సీనియర్ నాయకురాలు ఏపూరి జయమ్మ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక మహిళల సాధికారత, 33 శాతం రిజర్వేషన్ల అమలు, హక్కులపై మాటలు చెప్పడం తప్ప చేతల్లో ఏమి చేయలేదని ఆరోపించారు. తండ్రి ఆస్తిలో ఆడపిల్లకు సమాన హక్కు, వరకట్న నిషేధ చట్టం అమలులో విఫలమయ్యారని మండిపడ్డారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ మహిళకు రూ.2,500 ఇస్తామని హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి గత మూడేళ్లలో ఐద్వా చేసిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణను వివరించగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడారు. బండి పద్మ, మెరుగు రమణ, మెహరున్నీసా బేగం అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సభలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనతో పాటు నాగసులోచన, ప్రభావతి, కృష్ణవేణి, రజిత, పకీరమ్మ, సునీత, అమరావతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



దరఖాస్తుదారుల సమస్యలపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: వివిధ సమస్యలపై గిరిజన దర్బార్‌లో వినతిపత్రాలు, దరఖాస్తులు ఇచ్చే గిరిజనులు అన్ని అర్హత పత్రాలను జత చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ మేరకు వారు అందజేసి దరఖాస్తులను పరిశీలించి అర్హతల మేరకు పరిష్కరించాలని యూనిట్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం గ్రామస్తులు త్రీఫేస్ విద్యుత్ కోసం, సింగరేణి మండల వాసులు, కొణిజర్ల మండలం విక్రమ్ నగర్‌కు చెందిన గ్రామస్తులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల కోసం మణుగూరుకు చెందిన బిక్షం సింగరేణి సేకరించిన భూమి పరిహారం కోసం దరఖాస్తులు సమర్పించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావుతో పాటు వివిధ శాఖల అధికారులు తానాజీ, రవీంద్రనాథ్, సున్నం రాంబాబు, భాస్కర్, ఉదయ్‌కుమార్, మణిధర్, సమ్మయ్య, శ్రీనివాసరావు, రమణయ్య, లక్ష్మీనారాయణ, మునీర్‌పాషా, ఆదినారాయణ, హరికృష్ణ, లింగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్టమైన ప్రణాళికతో బొగ్గు ఉత్పత్తి



మణుగూరు ఓసీలో పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసేలా నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణ సూచించారు. మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన పీకేఓసీ, మణుగూరు ఓసీల్లో బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఓబీ వెలికితీత లక్ష్యాలను సాధించేలా వేగం పెంచాలని, యాంత్రిక శక్తిని సంపూర్ణంగా వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు శ్రీనివాస్, లక్ష్మీపతిగౌడ్, రాంబాబు, వీరభద్రుడు, మదన్‌నాయక్, రమణరావు, రాజేశ్వరరావు, నరసింహస్వామి, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.